సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 25 । మార్చి । 2023



వ్యవసాయ అభివృద్ధికి కృషి

ఆర్‌బీకేల ద్వారా రైతులకు సూచనలు అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. -8లో..

శవమై తేలిన పశుసంవర్ధక డీడీ అచ్చెన్న



పశుసంవర్ధకశాఖలో కడప వెటర్నరీ పాలీక్లినిక్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ అచ్చెన్న మృతదేహం అన్నమయ్య జిల్లా రామాపురం పీఎస్ పరిధిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో లభ్యమైంది. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.114	రూ.152
రెండోరకం	రూ.70	రూ.110

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 212 మెట్రిక్ టన్నులు



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
రాజంపేట	6.31	4.58
రాయచోటి	6.31	4.55
మదనపల్లి	6.32	4.56
పీలేరు	6.28	4.52

రామదర్శనం.. ముక్తిదాయకం

26 నుంచి పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో వెలసిన పట్టాభి రామ స్వామిని దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. వాల్మీకి మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేయడంతోనే ఈ గ్రామానికి వాల్మీకిపురం అన్న పేరు వచ్చిందని, శ్రీరామచంద్రుడు వాల్మీకం (పుట్ట)లో వెలిసినందున వాల్మీకిపురం అయిందన్న అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ వెలసిన పట్టాభిరాముడికి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది 26వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో..

ఆలయ అనువంశిక ధర్మకర్తలుగా ప్రస్తుత ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుటుంబీకులు వ్యవహరించేవారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న పట్టాభిరామస్వామి ఆలయాన్ని 1997 సంవత్సరం ఫిబ్రవరి 23న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో తిరుమల-తిరుపతి దేవస్థానానికి అనుబంధ దేవాలయంగా చేర్చారు. నాటి నుంచి నేటి వరకు తిరుమల-తిరుపతి దేవస్థానంవారు ఎంతో వైభవంగా ప్రతియేటా పట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే ఏడాదికి ఒక్కసారి పవిత్రోత్సవాలు, పట్టాభిషేక మహోత్సవాలు, ప్రతి మాసం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు.




పట్టాభిరామస్వామి దేవాలయం

ఇలా చేరుకోవచ్చు

తిరుపతి నుంచి 90 కిలో మీటర్లు దూరంలో వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామాలయం ఉంది. తిరుపతి-మదనపల్లి హైవే రోడ్డు పక్కన ఉంది. తిరుపతి నుంచి ప్రతి 30 నిమిషాలకు బస్సు సౌకర్యం ఉంది. అలాగే మదనపల్లి నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. మదనపల్లి నుంచి ప్రతి 15 నిమిషాలకు బస్సు సౌకర్యం ఉంది.

ఆలయ ప్రాశస్త్యమిదీ..

అన్నమయ్య జిల్లా, వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయం 1000 సంవత్సరాల క్రితం నిర్మించినట్లు, 13వ శతాబ్దంలోనే ఈ పట్టాభిరామస్వామి దేవాలయాన్ని పునర్‌నిర్మాణం చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. 15వ శతాబ్దంలో తొలి తెలుగు వాగ్గేయకారుడు పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు వాల్మీకిపురం క్షేత్రాన్ని సందర్శించి ఎన్నో కీర్తనలను రచించారు. ఈ పట్టాభిరామాలయంలో గల మూల విగ్రహాలను మహర్షి జాంబవంతులు ఒకేచోట ప్రతిష్ఠించారు. వాల్మీకిపురం పరిసర ప్రాంతంలోని శతశృంగపర్వతాలలో వాల్మీకి మహర్షి తపస్సు చేశారని, ఈ కారణంగా వాల్మీకిపురం క్షేత్రం పురాణ ప్రసిద్ధిగాంచింది. ఎంతో ఘనమైన చరిత్ర కల్గిన ఈ ఆలయానికి ఆనాటి రాజులు శ్రీకృష్ణదేవరాయులు, ఛత్రపతి శివాజి, ఆయన తల్లి జిజియాబాయి, సాళువ నరశింగభూపతిరాయలు, అలాగే ఆంగ్లేయుల అధిపతులలో థామస్ మన్రో, సి.పి బ్రౌన్, హార్డ్‌హార్డింగ్ వంటి వారు, ముస్లిం నవాబులు శ్రీరాముని సేవించి తరించారు.



వాల్మీకి మహర్షి తపస్సు చేసిన ప్రదేశం

ప్రత్యేక అలంకరణలో పట్టాభిరామస్వామి సమేత సీతమ్మ, లక్ష్మయ్య స్వామి



బ్రహోత్సవాల వివరాలు

26వ తేదీ ఆదివారం: బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

27వ తేదీ సోమవారం: ఉదయం - ధ్వజారోహణం , రాత్రి - గజ వాహన సేవ

28వ తేదీ మంగళవారం: ఉదయం - ముత్యపుపందిరి వాహనం , రాత్రి - హనుమంత వాహనం.

29వ తేదీ బుధవారం: ఉదయం - కల్పవృక్ష వాహనం, రాత్రి - సింహ వాహనం

30వ తేదీ గురువారం: ఉదయం - సర్వభూపాల వాహనం, రాత్రి - పెద్ద శేష వాహనం

31వ తేదీ శుక్రవారం: ఉదయం - సూర్య ప్రభ వాహనం, రాత్రి - చంద్ర పభ వాహనం, మోహినీ అవతారం

ఏప్రిల్ 01వ తేదీ శనివారం: ఉదయం - తిరుచ్చి ఉత్సవం , రాత్రి - శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, గరుడ సేవ.

02వ తేదీ ఆదివారం: ఉదయం - రథోత్సవం, సాయంత్రం - ధూళి ఉత్సవం

03వ తేదీ సోమవారం: ఉదయం - తిరుచ్చి ఉత్సవం , రాత్రి - పార్వేట ఉత్సవం , అశ్వవాహనం

04వ తేదీ మంగళవారం: ఉదయం - వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి - హంస వాహనం, ధ్వజావరోహణం

05వ తేదీ బుధవారం: ఉదయం - స్నపన తిరుమంజనం - సాయంత్రం - పుష్పయాగం, పుష్ప ప్రసాద వితరణ

675 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షకు 675 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 92 పరీక్షా కేంద్రాల్లో 19895 మంది విద్యార్థులకుగాను 19220 మంది హాజరయ్యారు. ఆర్ఐవో రమణరాజు వైఎస్సార్‌జిల్లా పొద్దుటూరులోని ఓ పరీక్షా కేంద్రంలో ముగ్గురిని, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు జమ్మలమడుగు పరీక్ష కేంద్రంలో నలుగురిని, మైదుకూరు, పోరుమామిళ్ల, అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఒక్కొక్కరి చొప్పున విద్యార్థులను డీబార్ చేశారు. ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవి ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినికి పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సందప్ప

పీలేరురూరల్ : ఏప్రిల్ 3 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణ సాధించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సందప్ప అన్నారు. శుక్రవారం కోటపల్లె బాలుర ఉన్నత పాఠశాలలో పీలేరు డివిజన్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షల పట్ల భయాన్ని వీడాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం ఎంఎస్ భారతి 160 మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు ఎం.ఆర్. మనోహర్‌రెడ్డి, ఏబీసీడబ్ల్యూవో కె. సురేష్‌బాబు, హెచ్ఎం శివశంకరయ్య, హెచ్‌డబ్ల్యూవోలు మునిస్వామినాయక్, సుబ్బరామయ్య, భారతి, ఉమామహేశ్వరి, చంద్రోఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

31 లోపు నమోదు చేయించుకోవాలి

రాయచోటి అర్బన్: జిల్లాలోని అన్ని ఆసుపత్రులు,క్లినిక్‌లు,ల్యాబొరేటరీలను వాటి యాజమాన్యాలు ఈనెల 31వ తేదిలోగా తమ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్థానిక ఎన్‌జిఓ హోంలో ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబొరేటరీ,స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు,ల్యాబ్‌లు,స్కానింగ్‌సెంటర్లను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డిప్యూటీ మాస్‌మీడియా అధికారిణి దేవశిరోమణి, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

రాయచోటి టౌన్ : అందరం ఏకమై క్షయవ్యాధిని నిర్మూలిద్దామంటూ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నినదించారు. శుక్రవారం ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బంగ్లా సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఎన్‌జీఓ హోంలో సమావేశం నిర్వహించారు. క్షయ వ్యాధి ఎలా సోకుతుంది.. నివారించడానికి ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే విషయాలపై ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్యశాఖ అధికారులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కొండయ్య మాట్లాడుతూ వ్యాధిని సకాలంలో గుర్తించి మందులు, పౌష్టికాహారం వాడటం ద్వారా నివారించవచ్చని తెలిపారు. అనంతరం టీబీ నివారణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ, డీసీహెచ్ డాక్టర్ చంద్రోఖర్, ఎంటీసీ రమేష్ బాబు పాల్గొన్నారు.

గ్రేడింగ్ యంత్రంతో నాణ్యమైన టమాటా

గుర్రంకొండ: గ్రేడింగ్ యంత్రాలతో నాణ్యమైన టమాటాలు మూడు గ్రేడింగ్‌లుగా విభజించవచ్చని మార్కెటింగ్ శాఖ కడప ఆర్జేడీ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రేడింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా యంత్రం ద్వారా టమాటాలు ఏవిధంగా విభజించవచ్చో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, గుర్రంకొండ, కలికిరి మార్కెట్‌యార్డులో తొలిసారిగా మార్కెటింగ్ శాఖ తరపున గ్రేడింగ్ యంత్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం.. ఆగ్రో సంస్థ సౌజన్యంతో ఒక్కొక్కటి రూ. 36 లక్షల విలువచేసే గ్రేడింగ్ యంత్రాలను యార్డుల్లో ఏర్పాటు చేశామన్నారు. మార్కెటింగ్ శాఖ కడప ఈఈ వెంకటేశ్వర్‌రావ్, డీఈలు సంపత్‌కుమార్, హరినారాయణరెడ్డి పాల్గొన్నారు.

మత్తురహిత జిల్లాగా మారుద్దాం



మాట్లాడుతున్న ఆర్‌వి క్రిష్ణకిశోర్

రాయచోటి: అన్నమయ్య జిల్లాను మత్తురహిత జిల్లాగా మారుద్దామని హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు ఆర్‌వి క్రిష్ణకిశోర్ పేర్కొన్నారు. రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్ బానిసకు గురికావడానికి కారకులు సమాజమా? లేక తల్లిదండ్రులా? అన్న అంశంపై పలువురు పెద్దలు విశ్లేషణ చేశారు. భారత పౌరులుగా మనందరం www.pledge.mygov.in అనే అంతర్జాల చిరునామాలో పేరు నమోదు చేసుకుని 'say yes to Life.. No Drugs' అని ప్రతిజ్ఞ చేద్దామని వివరించారు. రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలత, సైకియాట్రిస్టులు డాక్టర్ ఆర్.వెంకటరాముడు, డాక్టర్ సి.ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహోత్సవాల ఏర్పాట్లు మార్చి 31 తేదీ నాటికి పూర్తి చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. కల్యాణ వేదిక ప్రాంగణంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి రిహార్సల్స్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వారు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పనులు ఆయా ఇన్‌చార్జులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే తయారు చేస్తుకున్న కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆయన సూచించారు. డిప్యూటేషన్ సిబ్బంది, శ్రీవారి సేవకులు, హెల్ప్ డెస్కుల ఏర్పాటు, వసతి, తలంబ్రాల తయారీ, అన్నప్రసాదాల పంపిణీ, పారిశుద్ధ్యం , రవాణా ఇంజనీరింగ్ పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఏప్రిల్ 5వ తేదిన జరిగే శ్రీ కోదండ రామస్వామి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని ఆయన చెప్పారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని, వివిఐపీలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు.



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జేసీ సాయికాంత్‌వర్మ

- జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ..వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర పండుగగా జరుపుతున్న శ్రీ కోదండ రామస్వామి కల్యాణాన్ని విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని చెప్పారు అనంతరం జేఈవో, జాయింట్ కలెక్టర్ కలిసి ఏప్రిల్ 5వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల కాన్వాయ్ ఎంతవరకు రావాలి, కల్యాణ వేదికపై సీఎం, వీఐపీల సీటింగ్ తదితర ఏర్పాట్ల గురించి క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర, టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలో చేరుకోవాలి

బ్యాంకర్లతో కలెక్టర్ గిరీషా

రాయచోటి : బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత వ్యవధిలోగా చేరుకోవాలని బ్యాంకర్లకు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 9 కొత్త బ్యాంకు శాఖల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామని, అందులో ఆర్‌బీఐ నుంచి 3 కొత్త బ్యాంకులకు అనుమతులు ఇచ్చారని, మిగిలిన 6 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని త్వరగా క్లియర్ చేయాలని ఆర్‌బీఐ అధికారులకు కలెక్టర్ సూచించారు. అన్నమయ్య జిల్లా ఆర్థిక అభివృద్ధి వైపు పరుగులు తీసేలా బ్యాంకర్లు ఆర్థిక చేయూతనందించాలని చెప్పారు. వ్యవసాయ ఆధారిత కంపెనీల ఏర్పాటుకు సహకరించాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు బ్యాంకర్లు సహకరించాలని చెప్పారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు హౌసింగ్ రుణం ఇవ్వాలన్నారు. ఎల్డీఎం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ.9381 కోట్ల నిధులు వెచ్చించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.14.120 కోట్లు వెచ్చించారన్నారు. ప్రాధాన్యత రంగాల వృద్ధిలో 140 శాతానికి చేరుకున్నారని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. వ్యవసాయరంగానికి ఇప్పటి వరకు 158 శాతం రుణసదుపాయం కల్పించామన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, యూబీఐ ఆర్ఎం భాస్కర్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆర్ఎం జీఎంవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

- జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) అన్ని ప్రాజెక్టుల సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3-5 సంవత్సరాలలోపు గుర్తించిన పోషక, సూక్ష్మ పోషక లోపాలున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారి ఎదుగుదల కోసం చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనతతో ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గాలని స్పష్టం చేశారు. ఇందులో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీడీఎస్ పరిధిలో కోర్ట్ కేసులు ఉంటే వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని సూచించారు.
- పరిశ్రమను ప్రారంభించాలనుకునే నిజమైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని, పారిశ్రామిక అభివృద్ధి విధానం 2020-23ను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధితోనే ఉపాధి కల్పన పెరుగుతుందని, జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీకి సూచించారు.
- జిల్లాలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలు, మండలాల్లో ఏప్రిల్ 30లోపు హద్దురాళ్లను పాతించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రోజుకు 50 రాళ్లను పాతే విధంగా తహసీల్దార్లు కృషి చేయాలని సూచించారు. ఆర్డీఓలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాల న్నారు. జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మదనపల్లి ఆర్డీఓ మురళీ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

పాడిపశువులకు ప్రాణ సంజీవని

- లేవలేని పశువును నిలబెట్టేందుకు లిఫ్టర్ సాయం
- డౌనర్ కౌ సిండ్రోమ్ వ్యాధి చికిత్సలో ఉపయోగకారి
- రాష్ట్రంలో తొలిసారిగా మదనపల్లె ప్రాంతీయ పశువైద్యశాలలో 8 లిఫ్టర్లు
- ఆరునెలల్లో కోలుకున్న 80 పాడిపశువులు

మదనపల్లె: అధిక పాలదిగుబడినిచ్చే పాడిపశువులలో(ఆవులు, గేదెలలో) దూడను ఈనిన వెంటనే పాడిరైతులు ఎదుర్కొనే సమస్యల్లో డౌనర్ కౌ సిండ్రోమ్ వ్యాధి(పడక జబ్బు) ఒకటి. దీని గురించి తెలియని రైతులు లేరంటే అతిశయోక్తి కాదు. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు చికిత్స అందించే సమయంలో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చికిత్స కోసం అటు రైతు, ఇటు పశువైద్యులు చాలా శ్రమించాల్సిన పరిస్థితి. వీటన్నింటికి పరిష్కారంగా మదనపల్లె పట్టణానికి చెందిన శ్యామసుందరం తన సొంత ఖర్చులతో తమిళనాడులో ప్రత్యేకంగా 8 అనిమల్ లిఫ్టర్‌లను తయారు చేయించి రాష్ట్రంలో తొలిసారిగా మదనపల్లె ప్రాంతీయ పశువైద్యశాలకు తన తండ్రి ఏ.నారాయణస్వామి పేరుపై అందజేశాడు. మరో 5 లిఫ్టర్‌లకు ఆర్డర్ ఇచ్చి వాటిని త్వరలో అందజేయనున్నాడు. గత ఆరునెలల కాలంగా మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, కురబలకోట, చౌడేపల్లె, పుంగనూరు, బి.కొత్తకోట మండలాల పరిధిలో సుమారు 80 పాడిపశువులకు లిఫ్టర్ యంత్రాల ద్వారా చికిత్స అందించగా వాటిలో 90శాతం వరకు కోలుకుని ఆరోగ్యంగా ఉండటమే కాకుండా పాలు ఇస్తున్నాయి. లిఫ్టర్ యంత్రాలతో వస్తున్న మెరుగైన ఫలితాలపై రైతులు, ఇటు పశువైద్య సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



అనిమల్ లిఫ్టర్ యంత్రాలకు ప్రాంతీయ పశువైద్యశాలలో పూజలు చేస్తున్న వైద్యసిబ్బంది



అనిమల్ లిఫ్టర్ సహాయంతో చికిత్సలు అందించేందుకు నిల్చోబెట్టిన ఆవు

డౌనర్ కౌ సిండ్రోమ్ వ్యాధి..

డౌనర్ కౌ సిండ్రోమ్ వ్యాధి 24 గంటలకంటే ఎక్కువ కాలం పశువు లేవలేని స్థితిలో ఉండి, చికిత్సకు స్పందించకుండా, ఒక్కోసారి పశువు ప్రాణం కోల్పోయే వ్యాధి. పోషకాహార లోపం, మేతలో సమతుల్యత పాటించకపోవడంతో ఒక్కోసారి పశువు ఈనకముందు ఈ వ్యాధి వచ్చే ఆస్కారం ఉంది. ఈ వ్యాధి వచ్చిన పశువులు దీర్ఘకాలం పడుకుని ఉండటం వల్ల నడుము, తొడలు, కాళ్లభాగాల్లో పుండ్లు ఏర్పడి చికిత్స మరింత కష్టంగా మారి విషమ పరిస్థితిలో చనిపోయే అవకాశం లేదా రైతు పశువును అమ్ముకునే పరిస్థితి జరుగుతుంది. ఇలాంటి పశువులను అనిమల్ లిఫ్టర్ యంత్రాల ద్వారా లేపి నిలబెట్టి ఉంచి చికిత్స చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది.

మదనపల్లె ప్రాంతీయ పశువైద్యశాలలో సేవలు

పట్టణానికి చెందిన పాడిరైతు హరి పశుపోషణలో భాగంగా అనిమల్ లిఫ్టర్‌ను తమిళనాడు ఈరోడ్ నుంచి ప్రత్యేకంగా తెప్పించి, తన పశువుకు చికిత్స అనంతరం మదనపల్లె ప్రాంతీయ పశువైద్యశాలకు అందజేశాడు. దీనిద్వారా చికిత్స అందిస్తుంటే మంచి ఫలితాలు వస్తుండటంతో వీటిని కొనుగోలు చేయాలని భావిస్తున్న తరుణంలో ప్రాంతీయ పశువైద్యశాల ద్వారా తన ఆవుకు చికిత్సలు పొందిన శ్యామసుందరం అనే పాడిరైతు తండ్రి నారాయణస్వామి జ్ఞాపకార్థం ఒక్కొక్కటి రూ.35వేలు విలువజేసే 8 లిఫ్టర్‌లను మదనపల్లె ప్రాంతీయ పశువైద్యశాలకు అందించారు. వీటిని పశువైద్యశాల సిబ్బంది అవసరమైన రైతులకు ఉచితంగా ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయి పశువైద్య సిబ్బంది సహకారంతో వ్యాధితో బాధపడుతున్న పశువుకు ఉచితంగా చికిత్స అందిస్తున్నారు.

సద్వినియోగం కావడం సంతోషంగా ఉంది



ప్రాంతీయ పశువైద్యశాల డాక్టర్లు అనిమల్ లిఫ్టర్లు పశువైద్య చికిత్సలో చాలా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. తెలిసిన వారి ద్వారా తమిళనాడు ఈరోడ్‌లో వీటిని ప్రత్యేకంగా తయారుచేయించి తీసుకువచ్చాను. వైద్యులు వాటిని సమర్థవంతంగా వినియోగించి పశువులకు పునర్జన్మ ఇస్తుంటే సంతోషంగా ఉంది. - శ్యామసుందరం, రైతు, మదనపల్లె

మూడు, నాలుగురోజుల్లో కోలుకుంటున్నాయి




దీర్ఘకాలికంగా లేవలేని పశువులను అనిమల్ లిఫ్టర్ ద్వారా లేపి నిల్చోబెట్టి తదుపరి చికిత్స అందించడంతో 3-4 రోజుల్లోనే పశువు తనంతట తా నుగా లేవగలిగేలా చే యగలుగుతున్నాం. డౌనర్ కౌ సిండ్రోమ్ వ్యాధికి సంబంధించి లిఫ్టర్ యంత్రాలతో అందించిన చికిత్సలో 90శాతం ఆవులు కోలుకున్నాయి. మదనపల్లె ప్రాంతీయ వైద్యశాలలో 8 లిఫ్టర్ లు అందుబాటులో ఉన్నాయి. వీటిని రై తులకు ఉచితంగా అందిస్తున్నాం. - కోటేశ్వరరావు, డీడీ, మదనపల్లె ప్రాంతీయ పశువైద్యశాల

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించి, జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలంలోని ఏతూరు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి కుమారుడు హరినాథరెడ్డి(53) వ్యక్తిగత కారణాలతో శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. పుంగనూరు మండలం ఈడిగపల్లెకు చెందిన లోకేశ్వరి(24) కుటుంబ గొడవల కారణంగా శుక్రవారం ఉదయం ఇంటిలోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పీటీఎం మండలం బురుజుపల్లికి చెందిన మల్లికార్జున(23) కుటుంబ సమస్యల కారణంగా గురువారం రాత్రి ఇంటిలోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రంజాన్ వేళలు.. రూపుదిద్దుకున్న వేళ


సహర్, ఇఫ్తార్ వేళలు తెలియజేసే కార్డు

రాజంపేట టౌన్ : ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈమాసంలో వారు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షలు చేపడుతారు. ఉపవాసం చేపట్టే, విరమించే సమయాన్ని వారు విధిగా పాటిస్తారు. ఎందుకంటే సహర్, ఇఫ్తార్‌ల సమయం కంటే ముందు గానీ, ఆలస్యంగా కానీ ఉపవాసం చేపట్టడం, విరమించడం చేస్తే.. ఆ రోజు చేపట్టే ఉపవాస దీక్షకు సార్థకత ఉండదన్నది వారి భావన. అందువల్ల సహర్, ఇఫ్తార్‌లను సరైన సమయంలోనే పూర్తి చేస్తారు.

గతంలో ఎలా చేసే వారంటే..

ఉపవాస దీక్షలు చేపట్టే వారు సహర్, ఇఫ్తార్ వేళలను తెలుసుకునేందుకు ఇప్పుడు కార్డులు అందుబాటులోకి వచ్చాయి. అయితే పూర్వం ఇలాంటి సౌకర్యం ఉండేది కాదు. అందువల్ల సహర్, ఇఫ్తార్ వేళలు తెలియ చేసేందుకు ఆయా ప్రాంతాల్లోని మతపెద్దలు తూటాలను పేల్చేవారు. ఆ తరువాత కాలానుగుణంలో వచ్చిన మార్పుల కారణంగా సహర్, ఇఫ్తార్ వేళలు తెలియజేసే విధానంలో మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయి. టపాసులు అందుబాటులోకి వచ్చాక టపాసులను పేల్చే వారు. ఆ తరువాత మైక్‌లు అందుబాటులోకి వచ్చాక మసీదుల్లోని మైక్‌ల ద్వారా మౌజన్‌లు ఉపవాసం ప్రారంభానికి ఒక గంట ముందు రోజేదారో ఉఠో.. ఉఠో (ఉపవాస దీక్ష చేపట్టేవారు లేవండి) అంటూ చెబుతున్నారు. ఇక ఉపవాస దీక్ష ఉపసంహరించే సమయాన్ని కూడా అర్ధగంట నుంచి తెలియ చేస్తున్నారు. అయితే మసీదులకు సమీపంలో లేని వారు సైతం సహర్, ఇఫ్తార్ వేళలు పాటించడం కోసం స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, ధనవంతులు సహర్, ఇఫ్తార్ వేళలను తెలియజేసే కార్డులను ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద సెల్‌ఫోన్‌లు అందుబాటులో ఉండటంతో.. ఆ పట్టికను ఫొటోతీసి తమ సెల్‌ఫోన్‌లలో భద్రపరుచుకుంటున్నారు.

సమయ నిర్ధారణ పట్టిక ఎలా తయారైందంటే..

పూర్వం రంజాన్ మాసంలో ఉపవాసం ప్రారంభం, విరమణ సమయాల విషయంలో ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందులను గమనించిన ముఫ్తీ మహమ్మద్ రహీముద్దీన్ అబ్దుల్ వాసే ఉపవాస ప్రారంభ, విరమణ సమయ నిర్ధారణ పట్టిక తయారు చేయాలని నిర్ణయించారు. ఈయన ప్రపంచం మొత్తం ఉపవాస దీక్ష పాటించే సమయ పట్టికను 290 పేజీల పుస్తకం ×మియారుల్ ఔకాత్×లో పొందుపరిచారు. ఇప్పటికీ ఈ పుస్తకం ఆధారంగానే ఉపవాస పట్టికను నిర్ధారిస్తున్నారు. ఈ పుస్తకం ఆధారంగా 1968లో తొలిసారిగా ఉపవాస పట్టిక తయారైనట్లు ముస్లింలు చెబుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి వచ్చే సరికి సహర్, ఇఫ్తార్ వేళల్లో కొన్ని నిమిషాల తేడాతో సమయ పట్టికను రూపొందించారు. అందువల్ల ఒక పట్టణానికి మరో పట్టణానికి రెండు, మూడు నిమిషాల తేడాతో సహర్, ఇఫ్తార్ వేళలు ప్రారంభం అవుతాయి.


కార్డుల వల్ల విధిగా సమయ పాలన



“ సహర్, ఇఫ్తార్ వేళలు తెలియచేసే కార్డుల వల్ల ప్రతి ఒక్కరూ కచ్చితమైన సమయానికి సహర్, ఇఫ్తార్ వేళలను పాటించేందుకు వీలవుతుంది. కార్డులు అందుబాటులోకి రాక ముందు సహర్, ఇఫ్తార్ వేళలను ఇతరులను అడిగి తెలుసుకోవాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఆ సమస్య లేదు.

– ఎస్.షామీర్‌బాషా, ప్రెసిడెంట్, కూబామసీదు, రాజంపేట

బెంగళూరుకు వారాంతపు బస్సు సర్వీసుల పెంపు


జిల్లా ప్రజా రవాణా అధికారి రాము

మదనపల్లె సిటీ : బెంగళూరుకు వారాంతంలో బస్సు సర్వీసులు పెంచనున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి పి.రాము అన్నారు. శుక్రవారం స్థానిక వన్, టు డిపో కార్యాలయాలు, డిపో గ్యారేజీ, బస్సులను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నుంచి సోమవారం వరకు అదనంగా సర్వీసులు నడుపుతామన్నారు. హైదరాబాదుకు రెండు స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సులు వచ్చాయన్నారు. స్పెషల్ బెర్తులు ఉంటాయన్నారు. త్వరలో బస్సు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. వన్‌డిపో ఆవరణంలోని పెట్రోల్ బంకు పనులు పూర్తికాగానే ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇంటి నుంచి పరీక్షా కేంద్రాలకు వరకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లు చూపించాలన్నారు. కార్యక్రమంలో 1,2 డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్, సీఐలు రేవతి, గీత, సిబ్బంది పాల్గొన్నారు. టు డిపో పరిధిలో ఈపీకే, కేఎంపీఎల్ అధికంగా తెచ్చిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

నిమ్మనపల్లె : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మదనపల్లె కోర్టులో న్యాయమూర్తి రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ ఫాతిమా తెలిపారు. ఈ నెల 19న మండలంలోని పిట్టావాండ్ల పల్లె వద్ద ఎస్‌ఐ ఫాతిమా సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మద్యం సేవించి తిరుపతికి చెందిన యుగంధర్ వాహనం నడుపుకొంటూ వచ్చాడు. పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, యుగంధర్ మద్యం సేవించినట్లు గుర్తించి బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఫలితాల్లో తాగినట్లు తేలడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని ఈ నెల 24న కోర్టులో హాజరుపరిస్తే న్యాయమూర్తి రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

శవమై తేలిన పశుసంవర్ధక డీడీ అచ్చెన్న

* అదృశ్యం కేసుపై వీడిన మిస్టరీ
* గువ్వలచెరువు ఘాట్‌లో మృతదేహం లభ్యం
* పోలీసులు లోతుగా దర్యాప్తు


డాక్టర్ అచ్చన్న (ఫైల్)

కడప అర్బన్/రామాపురం : పశుసంవర్ధకశాఖలో కడప వెటర్నరీ పాలీక్లినిక్(వీపీసీ)లో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ అచ్చెన్న అదృశ్యం కేసుపై మిస్టరీ వీడింది. ఆయన మృతదేహం అన్నమయ్య జిల్లా రామాపురం పీఎస్ పరిధిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో లభ్యమైంది. ఈ సంఘటనపై ఒకవైపు రామాపురం పోలీసులు, మరోవైపు కడప వన్‌టౌన్ పోలీసులు పరస్పరం విచారణ చేస్తున్నారు. కాగా ఈ నెల 12 నుంచి కనిపించకుండా పోయారని అతని కుమారుడు, కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పని చేస్తున్న డాక్టర్ క్లింటన్ చక్రవర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఆధ్వర్యంలో ఈ నెల 15న అదృశ్యం కేసును నమోదు చేసి దర్యాప్తు కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని నియమించారు.

ఆది నుంచి వివాదాల్లో..

కడప వీపీసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న అచ్చెన్న, సిబ్బంది మధ్య గతేడాది నవంబర్ నెలలో వివాదం ప్రారంభమైంది. డీడీ అచ్చన్న తన కింద పని చేసే ఒక ఏడీ పని తీరు సరిగా లేదని రాష్ట్రశాఖకు సరెండర్ చేశాడు. కింది స్థాయి ఉద్యోగులను సరెండర్ చేసే అధికారం డీడీ అచ్చన్నకు లేదంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో విచారణకు కమిటీని ఆదేశించారు. ఆ కమిటీ విచారణ చేసి నివేదికలను రాష్ట్ర పశుసంవర్ధశాఖ ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు డీడీ అచ్చన్నను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కడప వీపీసీలో పని చేసే మరో ఏడీకి డీడీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సదరు ఉత్తర్వులపై డీడీ అచ్చన్న కోర్టుకు వెళ్లి యథాస్థానంలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అక్కడి నుంచి వీపీసీలో వివాదం ప్రారంభమైంది. ఆ తరువాత అచ్చన్న వీపీసీలో పని చేసే మరో ఏడీ, డాక్టర్ పనితీరు సరిగా లేదని వారిద్దరిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. తరువాత మరో ఏడీతోపాటు కార్యాలయంలో పని చేసే ఇద్దరు కింది స్థాయి ఉద్యోగుల పనితీరు కూడా సరిగా లేదని వారిని కూడా సరెండర్ చేశారు. ఇలా మొత్తం ఐదుగురిని సరెండర్ చేశాడు. దీంతో వారంతా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది. ఈ విషయమై రాష్ట్ర ఉన్నతాధికారులు విచారణ చేసి అచ్చెన్నను ఈ నెల 15వ తేదీన సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన స్థానంలో ఎఫ్‌ఏసీ డీడీగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ బాధ్యతలు చేపట్టేలా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆమె ఎఫ్‌ఏసీ డీడీగా బాధ్యతలను చేపట్టారు.

ఏమైంది? : తరువాత డీడీ అచ్చెన్న కనిపించడం లేదని కుటుంబ సభ్యులు కడప వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఈ క్రమంలో శవమై తేలడంతో ఏమి జరిగిందనేది అంతు చిక్కడం లేదు. సెల్‌ఫోన్ స్విచాఫ్ రావడంతో ఎవరైనా గిట్టని వాళ్లు కిడ్నాప్ చేశారా? లేక వ్యక్తిగతంగా వెళ్లారా? అనే విషయాలపై వారు ఆరా తీస్తున్నారు. ఎట్టకేలకు అదృశ్యమైన దాదాపు 12 రోజులకు ఆయన మృతదేహం లభించడంతో కుటుంబం, బంధువుల్లో విషాదం నెలకొంది. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

ఆటోను ఢీకొన్న టెంపో

• ఒకరి దుర్మరణం • మరో ఇద్దరికి గాయాలు


మృతి చెందిన వెంకటేష్

మదనపల్లె : మండలంలోని బసినికొండ పంచాయతీ పాత ఆర్టీఓ ఆఫీసు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఆటోను టెంపో ఢీకొనడంతో.. ఒకరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మదనపల్లె పట్టణంలోని గొసియావీధికి చెందిన షేక్ ఖాజామొహిద్దీన్(26) టెంపో వాహనంలో బోయకొండ నుంచి కోళ్లను వేసుకుని మదనపల్లెకు వస్తూ.. మార్గంమధ్యలో పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనకు సంబంధించి కేటరింగ్ సామగ్రిని తీసుకువెళుతున్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చొని ప్రయాణిస్తున్న శ్రీసత్యసాయిజిల్లా తనకల్లు మండలం ముండ్లవారిపల్లెకు చెందిన కె.వెంకటనారాయణ కుమారుడు వెంకటేష్ (35) ఎగిరి రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న చంద్రకళ(40), డ్రైవర్ సురేష్(27) తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్ వాహనంలో బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెంపో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

కలకడ : విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన సంఘటన మండలంలోని దేవులపల్లె పంచాయతీ గొబిళ్ళవారిపల్లెలో శుక్రవారం జరిగింది. గొబ్బిళ్ళవారిపల్లెలో ఉచిత మోటార్‌కు సంబంధించి విద్యుత్ సర్వీస్ సమస్య ఉందని రైతులు తెలియజేశారు. లైన్ మ్యాన్ బాషాకు రాతిగుంటపల్లె పంచాయతీ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ముత్యాల సుదర్శన కుమారుడు మురళి అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. తనకు విద్యుత్ స్తంభం ఎక్కడానికి సమస్యగా ఉందని మురళికి బాషా చెప్పాడు. తాను విద్యుత్ సర్వీస్ ఎల్‌సీ తీసుకున్నానని, స్తంభం పైకి ఎక్కి మరమ్మతు చేయాలని బాషా ఆదేశించాడు. స్తంభం పైకి ఎక్కి మరమ్మతు చేయడానికి విద్యుత్ లైన్ తాకగానే షాక్ కొట్టి కాలిన గాయాలతో కింద పడిపోయాడు. బాధితుడిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి తండ్రి సుదర్శన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నిప్పంటుకుని చిన్నారికి..

నిమ్మనపల్లె : నిప్పంటుకుని చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. తవళం పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన మహేష్, గాయత్రి దంపతులకు చైతన్య(1) బాబు ఉన్నాడు. ఉదయం నిద్రలేచి కాఫీ పెట్టేందుకు స్టవ్ వెలిగించిన గాయత్రి పక్కనే ఉన్న చైతన్యకు పాలిచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. ప్రమాదవశాత్తు మంటలు పిల్లవాడి దుస్తులకు అంటుకుని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్సల కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

పోలీసు కస్టడీకి మద్యం రవాణా నిందితులు

మదనపల్లె : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ వరుసగా మూడు సార్లు పట్టుబడిన నిందితులను ఎస్‌ఈబీ పోలీసులు విచారణ నిమిత్తం సబ్ జైలు నుంచి శుక్రవారం పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. ఎస్‌ఈబీ ఏఈఎస్ రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... బి.కొత్తకోట మండలంలో ఒకసారి, మదనపల్లె మండలంలో రెండుసార్లు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన డాబాసూరి(సూర్యచంద్రారెడ్డి), అంజినాయక్, గోపాల్ ముగ్గురిని కోర్టు అనుమతితో విచారణ నిమిత్తం ఎస్‌ఈబీ అధికారులు పోలీస్ కస్టడీకి తీసుకున్నట్లు చెప్పారు. ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో వారిని ఏఈఎస్ రాధాకృష్ణ, రాయచోటి అటాచ్డ్ సీఐ శంకరమల్లయ్య విచారణ చేశారు. కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని జిల్లాలో ఎక్కడెక్కడికి, ఎవరెవరికి తరలిస్తున్నారు. వీరికి రవాణాలో సహకారం అందిస్తున్న వ్యక్తుల వివరాలు, అక్రమ మద్యం కొనుగోలు, రవాణా, అధికారుల కళ్లు గప్పి తరలించడం, ఏ సమయాల్లో రవాణా జరుగుతుందనే విషయాలన్నింటిపై విచారించినట్లు చెప్పారు. దీంతోపాటు ఆరునెలల వ్యవధిలో మూడు సార్లు ఎస్‌ఈబీ కేసులు నమోదైన వ్యక్తుల వివరాలను తీసుకుని వీరికి జిల్లా బహిష్కరణ, లేకపోతే పీడీ యాక్ట్ పెట్టాలా అనే విషయమై అధికారులు చర్చిస్తున్నట్లు తెలిసింది.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో బెటాలియన్ విద్యార్థి


ప్రణీత్ కుమార్, కుటుంబ సభ్యులను మెమెంటోలతో అభినందిస్తున్న కమాండెంటు శ్రీనివాసరావు

సిద్దవటం : మండలంలోని భాకారాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌కు చెందిన 8వ తరగతి చదవుతున్న సి.ప్రణీత్ కుమార్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినందుకు కమాండెంటు శ్రీనివాసరావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్లో పోలీసుగా పని చేస్తున్న సి.శివప్రసాద్, లక్ష్మీరెడ్డెమ్మ కుమారుడు ప్రణీత్‌కుమార్ ఆంగ్ల భాషలో అక్షరాలు అయిన ఎ నుంచి జెడ్ వరకు 3.30 సెకన్లలో టైప్ చేసినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారన్నారు. ఈ విషయమై కమాండెంట్ శ్రీనివాసరావు సదరు తల్లిదండ్రులకు, ప్రణీత్‌కుమార్‌లను సత్కరించి మెమెంటోలను అందజేసి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంటు కె. వెంకట్‌రెడ్డి, బెటాలియన్ ఆఫీస్ ఏఓ గులాం దస్తగిరి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి కృషి

* జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి
* చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలి
* జేసీ తమీమ్ అన్సారియా


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

రాయచోటి : ఆర్‌బీకేల ద్వారా రైతులకు సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు అందిస్తూ జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశాన్ని సంబంధిత అధికారులతో కలిసి జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్వహించారు. ఈ సందర్భంగా పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నీ కూడా వివిధ శాఖల ద్వారా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఈనెల 30వ తేదీలోపు పరిశీలించి నివేదికలు పంపాలని సూచించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4వ తేది నుంచి జిల్లా స్థాయిలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అదే విధంగా డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించాలన్నారు. రబీ–2023కు సంబంధించి పంట నమోదు వివరాలను సామాజిక తనిఖీ ద్వారా సవరించి తుది జాబితాను ఈనెల 30వ తేదిలోపు రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించాలని సహాయ వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు. గ్రామానికి ఒకటి చొప్పున మంజూరైన కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను (యంత్ర సేవా కేంద్రాలు) త్వరితగతిన ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులు దిన్నెపాడు రవిరాజు, బోధషావలి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

* అంతర్ రాష్ట్ర నిందితుడి అరెస్ట్
* 816 టెట్రా ప్యాకెట్లు, కారు సీజ్


పట్టుకున్న మద్యం, నిందితుడితో సీఐ, ఎస్‌ఐలు, పోలీసులు

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకుని, అంతర్ రాష్ట్ర నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. మండలంలోని చీకలబైలు వద్ద ఉదయం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న 816 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా శ్రీనివాసపురం తాలూకా గుంటిపల్లెకు చెందిన సుబ్బానాయక్ కుమారుడు జి.ఎస్. రామును అరెస్ట్ చేశారు. మద్యం, కారు విలువ కలిపి సుమారు రూ.2 లక్షలు ఉంటుంది. జి.ఎస్.రాము ఆరు నెలల క్రితం ఆటోలో 6 బాక్స్‌ల మద్యం తరలిస్తూ ఎస్‌ఈబీ పోలీసులు అరెస్ట్ చేయడంతో 12 రోజులు రిమాండ్‌లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చాడు. స్వాధీనం చేసుకున్న మద్యం, కారును సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపనున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు చంద్రశేఖర్, సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో క్రమశిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, సామాజిక సేవ, దేశభక్తి పెంపొందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం కడప శంకరాపురంలోని స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో కడప, అన్నమయ్య జిల్లాలోని స్కౌట్స్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు బేసిక్, అడ్వాన్స్ శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానే ఉపయోగపడుతుందన్నారు. ఏడు రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణను స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌కు చెందిన స్కౌట్స్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బేసిక్ శిక్షణ పొందిన వారే తమ విద్యార్థులకు సక్రమంగా శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. స్కౌట్ క్రమశిక్షణకు మారుపేరని, ప్రతి విద్యార్థి ఇందులో చేరాలన్నారు. స్కౌట్ సర్టిఫికెట్లు కలిగిన విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని స్కౌట్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీకర్, అసిస్టెంట్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ రమణయ్య, ఎల్‌ఓసీలు వెంకటేశ్వర్లు, శకుంతలమ్మ, స్టాఫ్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.